
దాత హెచ్ఎం మరియ మణిక్యమ్మను సన్మానిస్తున్న శశాంక

# విద్యార్థులు పుస్తకాలు చదవాలి

- కలెక్టర్ శశాంక
- పాఠశాలలో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభం

డోర్నకల్, నవంబర్ 7 : జీవితంలో చాలా విషయాలు నేర్చుకోవడం పుస్తకంతోనే సాధ్యం అవుతుందని కలెక్టర్ శశాంక సూచించారు. మంగళవారం డోర్నకల్ జడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో బదిలీపై వెళ్లిన హెచ్ఎం దాత మరియ మాణిక్యమ్మ సహకారంతో రూ. 3 లక్షలతో నిర్మించిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను కలెక్టర్ శశాంక, డీఈవో రామారావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శశాంక మాట్లాడుతూ డోర్నకల్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఆర్వో వాటర్ ప్లాంట్‌ను నిర్మించిన దాత పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన మరియ మణిక్యమ్మకు అభినందనలు తెలిపారు. పాఠశాలకు దాతలు సహకారం అభినందనీయమన్నారు. పాఠశాలకు 'మన ఊరు–మన బడి' కార్యక్రమంలో నుంచి పెయిటింగ్ వేయించాలని డీఈ మహేశ్ బాబుకు సూచించారు. పాఠశాల కార్యక్రమానికి రావడానికి పాఠశాల హెచ్ఎం నర్సింహరావు, తమ మదర్ రిక్వేస్ట్ చేసినట్లు తెలిపారు. హై స్కూల్‌కు వచ్చిన విద్యార్థులు ఐదేళ్ల తర్వాత ఏ స్థాయిలో ఉండాలనేది ఆలోచన ఉండాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభించినట్లు తెలిపారు. లైబ్రరీలో 600 పుస్తకాలు ఉన్నాయని ఉపాధ్యాయులు చెప్పారు. విద్యార్థులు పుస్తకాలు చదవడం నేర్చుకోవాలన్నారు. పదో తరగతి విద్యార్థులు 90 శాతం ఉత్తీర్ణత సాధించి, 10 జీపీఏ సాధించాలన్నారు. అనంతరం పాఠశాలలో నిర్మించిన మరుగు దొడ్లను, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఈవో రామారావు, ఏఎంవో మందుల శ్రీరాములు, ఎంఈవో పూల్ చంద్, హెచ్ఎంలు నర్సింహ రావు, మరియ మణిక్యమ్మ, ఉపాధ్యాయులు ప్రసాద రావు, శ్యామ్ బాబు, మాధవ రావు, సునీల్ కుమార్, అప్పిరెడ్డి, సురేశ్ బాబు, బిచ్చు, దేవేందర్, అమీనా బీ, కమల, దమయంతి పాల్గొన్నారు.

## పోలింగ్‌కు ప్రజలు సహకరించాలి



గంగారం: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ సంగ్రామ్ సింగ్ పాటిల్

గంగారం, నవంబర్ 7 : అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు సహకరించాలని జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ సూచించారు. మంగళవారం గంగారం పోలీస్‌స్టేషన్ ఆవరణంలో మొక్క నాటారు. అనంతరం మండల కేంద్రంలోని గిరిజన బాలికల పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఓటర్లుకు వసతులు, భద్రతకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ అధికారులకు సూచనలిస్తూ ఎన్నికల సమయంలో మద్యం, డబ్బుపై నిఘా పెంచాలన్నారు. ఎన్నికలు పారదర్శంగా జరిగేలా భద్రత తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ సత్యనారాయణ, సీఐ ఫణీదర్, ఎస్సై దిలీప్ పాల్గొన్నారు.

**మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఎస్పీ పర్యటన..**

కొత్తగూడ: మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన కొత్తగూడ ఏజెన్సీలో ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ పర్యటించారు. మంగళవారం కొత్తగూడ, గంగారం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. స్థానిక సమస్యలను ఎస్సైలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఓటు హక్కును నిర్భయంగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వేలుబెల్లి, గంగారం ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయన వెంట డీఎస్పీ సత్యనారాయణ, గూడూరు సీఐ ఫణీదర్, కొత్తగూడ, గంగారం ఎస్సైలు నగేశ్, దిలీప్, సిబ్బంది పాల్గొన్నారు.

**పోలీస్ స్టేషన్ తనిఖీ..**

గూడూరు: మండలంలోని సర్కిల్ కార్యాలయాన్ని ఎస్సీ సంగ్రామ్ సింగ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా ముందుగా స్టేషన్‌లోని కేసుల వివరాలను తెలుసుకున్నారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. అనంతరం డీఎస్పీ సత్యనారాయణ, సీఐ ఫణీదర్, ఎస్సై రాణాప్రతాప్, సిబ్బందితో కలిసి పోలీస్ స్టేషన్‌లోని సమావేశం మందిరంలో ఎన్నికల విధులు, నిర్వాహణ, శాంతి భద్రతలపై వివరించారు. ఎన్నికల నేపథ్యంలో ఏర్పాట్లు, శాంతి భద్రలకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

# ఎమ్మెల్యేగా సీతక్క ఏం చేసింది?

- ప్రజా సమస్యలు పట్టించుకోని వారిని తరిమికొట్టాలె
- కాంగ్రెస్‌ను నమ్మితే నిండా మునుగుడే
- పోడుదారులకు రైతుబంధు ఇచ్చిన ఘనత బీఆర్ఎస్‌దే..
- ములుగు బీఆర్ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతి
- గిరిజనేతరులకు పోడు పట్టాలు ఇస్తాం
- ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న బడె నాగజ్యోతి

కొత్తగూడ, నవంబర్ 7: ములుగు ఎమ్మెల్యేగా సీతక్క రెండు పర్యాయాలు గెలిచి ప్రజలకు ఏం చేశారో చెప్పాలని బీఆర్ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతి ప్రశ్నించారు. మంగళవారం మండలంలోని కొత్తపల్లి, పెగడపల్లి, లడాయిగడ్డ, రామన్నగూడెం, ముస్మీ, చెరువుముందు తండా, వేలుబెల్లి, పోలారం, బత్తులపల్లి, గోపాలపురం గ్రామాల్లో నాగజ్యోతి ప్రచారం చేయగా వేలుబెల్లిలో నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ఆయా గ్రామాల్లో ఆమె మాట్లాడుతూ ఓట్లు దండుకోవడానికి కాంగ్రెస్, బీజేపీ నాయకులు మాయమాటలు చెప్తున్నారని ప్రజలు నమ్మి మోసపోవద్దని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిందన్నారు. పోడు రైతులకు రైతుబంధు ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. పింఛన్లు సైతం పెంచి ఇసున్నట్లు వివరించారు. ప్రజా సమస్యలను పట్టించుకోని కాంగ్రెస్‌ను తరిమికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఆర్వో ఎఫ్ఆర్ చట్టాన్ని తెచ్చి పోడు చేసుకుంటున్న రైతులు మూడు తరాల నుంచి ఆధారాలు తెమ్మంటే ఎలా తెస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ప్రజా సమస్యల పరిష్కారంలో పాలకులు విఫలమయ్యారన్నారు. అలాంటి వారికి పట్టం కడితే మరో 50 ఏండ్లు వెనక్కి వెళ్లాల్సి వస్తుందన్నారు.

**గిరిజనేతరులకు పోడు పట్టాలు ఇస్తాం..**

ఎన్నో ఏండ్లుగా గిరిజనులతో మమేకమై జీవిస్తున్న గిరిజనేతరులకు సైతం పోడు భూములపై హక్కులు కల్పించాలనే ఉద్దేశంతోనే సీఎం కేసీఆర్ మ్యానిఫెస్టో విడుదల చేశారని నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వేలుబెల్లి ప్రచారలో మాట్లాడుతూ కొత్తగూడ, గంగారం ఏజెన్సీలో రైతులకు పాకాల నీటిని అందించి సస్యశ్యామలం చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రోడ్డు సౌకర్యం లేని గ్రామాల్లో రహదారులను అభివృద్ధి చేస్తామన్నారు. నాగజ్యోతిని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రచారంలో ఓడీసీఎం వైస్ చైర్మన్ దేశిడి శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కొమ్మణబోయిన వేణు, కంది అనీల్‌రెడ్డి, బానోత్ నెహ్రూ, సర్పంచులు, ఎంపీటీసీలు, సంతోష రాణి, రమేశ్ పాల్గొన్నారు. కాగా ప్రతి గ్రామంలో కాంగ్రెస్ నుంచి పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.


కురవి: ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

# ఊరూరా అభివృద్ధి.. ఇంటింటా సంక్షేమం

- కేసీఆర్ పాలనలో సబ్బండ వర్గాల అభ్యున్నతి
- బీఆర్ఎస్‌కే ఓటు అడిగే హక్కు ఉన్నది
- కారు గుర్తుకు ఓటు వేసి రెడ్యానాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి
- మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న


డోర్నకల్ : ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

డోర్నకల్, నవంబర్ 7: స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ సారథ్యంలో ఎమ్మెల్యే ధరంసోత్ రెడ్యానాయక్ నేతృత్వంలో తొమ్మిదిన్నరేండ్లు నియోజకవర్గంలో ఊరూరా అభివృద్ధి జరిగిందని.. ఇంటింటా సంక్షేమ పథకాలు అందయని మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని 8, 15వ వార్డుల్లో ఎన్నికల మ్యానిఫెస్టోలోని పథకాలను వివరిస్తూ బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించిన ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వమని, బీఆర్ఎస్ పార్టీకి మాత్రమే ప్రజలను ఓటు అడిగే హక్కు ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతున్నదని, కారు గుర్తుకు ఓటు వేసి ధరంసోత్ రెడ్యానాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ కేశబోయిన కోటిలింగం, వార్డు కౌన్సిలర్ కాలా మౌనికాజైన్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు షేక్ అజిత్‌మియా, బీఆర్ఎస్ నాయకులు కాలా యశోధర్ జైన్, మైనార్టీ నాయకులు గౌస్‌పాషా పాల్గొన్నారు.

**బీఆర్ఎస్‌ను గిరిజనులు గుండెల్లో పెట్టుకోవాలి**

కురవి: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి సీఎం కేసీఆర్ గిరిజనులపై ప్రత్యేక ప్రేమ చూపారని, రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి రుణం తీర్చుకోవాలని లింగ్యాతండా (కురవి) సర్పంచ్ రవి అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ గెలుపు కోరుతూ మంగళవారం గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి తొమ్మిదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ప్రస్తుత మ్యానిఫెస్టోలోని పథకాలపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మా ట్లాడుతూ తండాలను గ్రామ పంచాయతీలుగా చేసి గిరిజనులకు రాజకీయ భవిష్యత్ కల్పించిన గొప్ప నాయకుడు సీ ఎం కేసీఆర్ అన్నారు. రిజర్వేషన్ పెంచి మన పిల్లలకు బంగారు భవిష్యత్ చూపారన్నారు. గిరిజనులు ఎక్కువ శాతం వ్యవసాయంపై ఆధారపడే కుటుంబాలేనని, రైతుబం ధు, రైతుబీమా, ఉచిత కరెంత్‌తో లబ్ధి చేకూరుతున్నదని చెప్పారు. రుణమాఫీ చేసి మన అప్పులను బీఆర్ఎస్ ప్రభు త్వం తీర్చిందన్నారు. కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు లక్ష్మణ్, రూప్లా, వెంకన్న, యుగేంధర్, చిన్న వెంకన్న, జగిత్యా, పండరీ, రామ్‌కోటి, మాలన్, వెంకన్న, లాలూ, రాంచంద్ పాల్గొన్నారు.

## నేడు ఎమ్మెల్యే రెడ్యానాయక్ నామినేషన్

మరిపెడ, నవంబర్ 7: డోర్నకల్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డీఎస్ రెడ్యా నాయక్ బుధవారం మరిపెడ రిటర్నింగ్ కార్యాలయంలో తన నామినేషన్ వేయనున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు తెలిపారు. పార్టీ కార్యకర్తలు ఎన్నికల నియమావళిని దృష్టిలో పెట్టుకుని నామినేషన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

## మానవ అక్రమ రవాణాకు పాల్పడితే జైలుకే

హనుమకొండ, నవంబర్ 7 : మానవ అక్రమ రవాణాకు పాల్పడిన వ్యక్తులకు కఠిన శిక్షలు పడేలా చూస్తున్నామని కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజు అన్నారు. మంగళవారం సుబేదారిలోని అశుంత భవన్‌లో ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సమితి గర్ల్స్ అడ్వకేసి యాక్షన్ కార్యక్రమంలో భాగంగా సంస్థ కోఆర్డినేటర్ బత్తుల కరుణ అధ్యక్షతన మానవ అక్రమ రవాణా నిర్మూలనపై వివిధ ప్రభుత్వ శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డేవిడ్ రాజ్ మాట్లాడుతూ అక్రమ రవాణాకు పాల్పడే వ్యక్తులు చట్టాన్ని ఆసరాగా చేసుకుని చాలా సందర్భాల్లో శిక్ష నుంచి తప్పించుకుంటున్నారన్నారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ అనిల్‌చందర్‌రావు, సంతోష్ కుమార్ మాట్లాడుతూ అక్రమ రవాణా బాధితులకు నష్టపరిహారం అందే లా చూస్తామన్నారు. హాజరైన అధికారులకు ఐటీపీఏ ఆక్ట్ 1956 అక్రమ రవాణా నిర్మూలనలో పోలీసుల పాత్రపై ప్రాజెక్టు కోఆర్డినేటర్ బత్తుల కరుణ, ప్రాజెక్టు అధికారి ఎర్ర శ్రీకాంత్ పీపీటీ ద్వారా అవగాహన కల్పించారు.

**ప్రకటన**

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **ఖమ్మం బ్రాంచ్–2** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **రెడ్డిమళ్ళ కవిత,** w/o : **శ్రీను, వయస్సు** : 22 సం॥లు, **వృత్తి** : గృహిణి, **నివాసం** : **ఇం.నెం.1–110,** మన్నెగూడెం, డోర్నకల్ మండలం, వరంగల్ జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లెయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 5 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నాక్లయింటు బాధ్యులు కారు.

**షెడ్యూలు ఆస్తి :** గ్రామ పంచాయితి మన్నెగూడెం మండలం, మండల పరిషత్తు డోర్నకల్, జిల్లా, జిల్లా పరిషత్తు మరియు జిల్లా రిజిస్ట్రారు వరంగల్ సబ్ రిజిస్ట్రారు మహబూబాబాద్ వారి పరిధిలో గల మన్నెగూడెం రెవిన్యూ గ్రామములో డోర్ నెం. 1–110/2 కి సంబంధించిన రేకుల కప్పు గల గృహము, **డాక్యుమెంట్ నెం. 4398/2015**, నిర్మిత విస్తీర్ణము : 120.00 చ॥ఫీట్లు మొత్తం స్థల విస్తీర్ణము : 439.00చ॥గ॥ సమము 367.06 చ॥మీ॥ గల ఆస్తికి సరిహద్దులు : **తూర్పు:** పొడిశెట్టి కొండయ్య గారి గృహము, **పడమర** : రెడ్డిమళ్ళ నాగయ్య గారి గృహము, **ఉత్తరం** : పొడిశెట్టి వెంకన్న గారి స్థలము, **దక్షిణం** : ఖమ్మం నుండి మహబూబాబాద్ పోవు ఆర్ & బి రోడ్డు.

**జి.హరేందర్ రెడ్డి**
**అడ్వకేట్, ఖమ్మం, సెల్ : 9848022542**